

ఆలయాలకు మహర్దశ
ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద మహర్దశ పట్టనుంది. - 10లో



అమెరికా సదస్సుకు..
వ్యవసాయ రంగంలో కొత్త ఆవిష్కరణలపై అమెరికాలో జరిగే సదస్సుకు అశోక్‌కు ఆహ్వానం అందింది. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 29° / 25°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సివిల్స్‌ ఉచిత శిక్షణకు 9న పరీక్ష

సూర్యాపేటటౌన్‌ : రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్‌ మెయిన్స్‌ ఉచిత కోచింగ్‌ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 9న హైదరాబాద్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు సూర్యాపేట ఎస్సీ స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ సీహెచ్‌.రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా నుంచి 228 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరికి సికింద్రాబాద్‌ సర్దార్‌ రోడ్డులోగల యూనివర్సిటీ పీజీ కళాశాల, దోమల్‌గూడలోని ఏవీ కళాశాల, నాంపల్లిలోని సరోజినీ నాయుడు వనితా మహా విద్యాలయ, కోఠిలోని ఉమెన్స్‌ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. ఉదయం 10గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో హాల్‌ టికెట్లు డౌన్‌లోడ్‌ చేసుకోవాలని సూచించారు.

మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత



వేపలసింగారంలో మొక్కలు పంపిణీ చేస్తున్న డీపీఓ యాదయ్య

హుజూర్‌నగర్‌రూరల్‌ : మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌ మండలం వేపలసింగారంలో నర్సరీలో పెంచిన మొక్కలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఇంటిలో మొక్కలను పెంచాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌, సర్పంచ్‌ అన్నెం శిరీషాకొండారెడ్డితో కలిసి నర్సరీలో పెంచిన మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శైలజ, కార్యదర్శి పెండెం నాగమణి, టీఏ అరుణ పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శాంతికుమార్‌, ఎంపీఓ లావణ్య, ఏపీఓ శైలజ పాల్గొన్నారు.

14న స్పోర్ట్స్‌ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక


సూర్యాపేటటౌన్‌ : తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్‌ స్కూల్‌లో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు జిల్లా స్థాయిలో ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల, యువజన శాఖ అధికారి వెంకట్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో హాజరైన బాలబాలికలకు తొమ్మిది మోటార్‌ క్వాలిటీ టెస్టులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన 10 మంది బాలికలు, 10 మంది బాలురను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. నాలుగో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల వయసు 8 నుంచి 9 సంవత్సరాల మధ్య ఉండాలని, ఐదో తరగతిలో ప్రవేశానికి 9 నుంచి 10 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపిక కోసం వచ్చేటప్పుడు విద్యార్థులు తమ వెంట ప్రస్తుతం చదువుతున్న స్టడీ సర్టిఫికెట్‌, జనన ధ్రువీకరణ పత్రం, పది పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫొటోలు, మూడో తరగతి, నాలుగో తరగతి ప్రోగ్రెస్‌ కార్డు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకొని 14న ఉదయం 8.30గంటల వరకు చేరుకోవాలని సూచించారు.

సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేయాలి

మద్దిరాల : సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని డీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. బుధవారం మండల పరిధిలోని పోలుమల్ల ప్రభుత్వ పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూలై 1తో పదో పీఆర్సీ గడువు పూర్తి అయినందున పీఆర్సీ కోసం కమిటీని నియమించాలని కోరారు. రిపోర్టు వచ్చే వరకు 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన గౌరవ వేతనాన్ని వెంటనే అమలు చేయాలని, ప్రతి మండలానికి ఎంఈఓను నియమించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు బి.క్రాంతికుమార్‌, బి.వెంకటయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రాములు, బి.దేవేందర్‌, పి.రవీందర్‌రెడ్డి, జె.అబ్రహం, ఆర్‌.సుధాకర్‌, సాహెబ్‌ అలీ, వి.సైదులు, వీరాంజనేయులు, జి.వెంకటేశ్వర్లు, శ్రీలత, సైదులు, అంజలి, వెంకటేశ్వర్లు, పూర్ణచారి తదితరులు పాల్గొన్నారు.

పేటలో ఆర్టీసీ చార్జింగ్‌

- ఆర్టీసీ ఎలక్ట్రిక్‌ బస్సులకు చార్జింగ్‌ పాయింట్‌ ఏర్పాటుకు సన్నాహాలు
- హైటెక్‌ బస్టాండ్‌లో ముమ్మరంగా పనులు
- రెండు మూడు నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళిక
- ప్రస్తుతం హైదరాబాద్‌– విజయవాడ రూట్లో నడుస్తున్న బస్సులకు ప్రైవేట్‌ పాయింట్ల వద్దే చార్జింగ్‌



భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎలక్ట్రిక్‌ చార్జింగ్‌ పవర్‌ పాయింట్‌ ఏర్పాటు చేస్తోంది. స్థానిక హైటెక్‌ బస్టాండ్‌లో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇటీవల మొదలు పెట్టిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌ –విజయవాడ రూట్లో నడుస్తున్న 5 నుంచి 8 ఎలక్ట్రికల్‌ బస్సులకు చార్జింగ్‌ సమస్య తలెత్తకుండా సూర్యాపేట పట్టణం అనుకూలంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రెండు మూడు నెలల్లో పనులు పూర్తి చేసి ఈ రూట్లో మొత్తం 50 బస్సులు నడపాలని ప్రణాళిక రూపొందించుకున్నారు.

చార్జింగ్‌ సమస్యతో..
ప్రస్తుతం డీజిల్‌ ధరలు పెరిగి ఆర్టీసీకి భారంగా మారుతున్న తరుణంలో కాలం చెల్లిన బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్‌ బస్సులను కొనుగోలు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతగా కొనుగోలు చేసిన బస్సుల్లో రంగారెడ్డి రీజియన్‌కు చెందిన సుమారుగా 5నుంచి 8 బస్సులను హైదరాబాద్‌ టు విజయవాడ రూట్‌ లో నడిపిస్తున్నారు. ఈ బస్సులకు ఒక్కసారి చార్జింగ్‌ పెడితే సుమారు 500 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తున్నాయని అయితే హైదరాబాద్‌ – విజయవాడ మధ్య సుమారు 275 కిలోమీటర్ల ఉండడం.. వాహనాల రద్దీ కారణంగా ఒక్కసారి చార్జింగ్‌ పెడితే తిరిగి హైదరాబాద్‌కు వచ్చే పరిస్థితి లేకుండా పోతోంది. దీంతో చార్జింగ్‌ అవసరాలను తీర్చుకోవడం కోసం ఆర్టీసీ కొద్దిరోజులుగా ప్రైవేట్‌ బంకులను ఆశ్రయించాల్సి వస్తోంది. సూర్యాపేటకు సమీపంలోని ఓ బంక్‌ లో చార్జింగ్‌ పెట్టుకుని తిరిగి ప్రయాణం చేస్తున్నారు. యాజమాన్యం మరిన్ని ఇలాంటి బస్సులను సమకూర్చుకునే ఆలోచనతో ఉండడంతో సొంతంగానే ఎలక్ట్రిక్‌ చార్జింగ్‌ పవర్‌ పాయింట్‌ ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందన్న అభిప్రాయానికి వచ్చింది. సూర్యాపేటలో ఒకటి, హైదరాబాద్‌ – అద్దంకి రూట్‌లో నల్లగొండలో మరొకటి ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది.

చకచకా పనులు
హైటెక్‌ బస్టాండ్‌లో చేపట్టిన చార్జింగ్‌ పవర్‌ పాయింట్‌ పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఇప్పటికే స్థలాన్ని చదును చేసి పిల్లర్లు నిర్మిస్తున్నారు. రెండు మూడు నెలల్లో పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు. ఇందులో ఒక్క బస్సుకు 5 నుంచి 10 నిమిషాల్లోనే చార్జింగ్‌ పూర్తవుతుంది. ఈ పనులు పూర్తి కాగానే హైదరాబాద్‌– విజయవాడ రూట్‌లో మొత్తం 50 బస్సులు నడపడానికి ప్రణాళిక రూపొందించుకున్నారు.

> **భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు**
> టీఎస్‌ ఆర్టీసీ ఎలక్ట్రిక్‌ బస్సుల కొనుగోలుకు ఆసక్తి చూపుతోంది. ప్రధాన నగరాలకు వీటిని ఉపయోగించాలని నిర్ణయించింది. దీంతో డీజిల్‌ భారం తగ్గడంతో పాటు కాలుష్యం తక్కువగా ఉంటుంది. భవిష్యత్‌లో మరిన్ని బస్సులు నడిపే అవకాశం ఉన్నందున సూర్యాపేటలో ఈ పాయింట్‌ను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు.
> – సురేందర్‌, ఆర్టీసీ డీఎం, సూర్యాపేట





సాగర్‌లో నౌకాయాన యాత్ర
నాగార్జునసాగర్‌ జలాశయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాలకు చెందిన నావల్‌ క్యాడెట్‌ల నౌకాయాన యాత్ర బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సెయిలింగ్‌ నిర్వహిస్తున్న క్యాడెట్లు

నెలాఖరులోగా జిల్లాకు సీఎం?

- ప్రారంభానికి సిద్ధమవుతున్న ప్రభుత్వ కార్యాలయాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

సూర్యాపేట : జిల్లాకు సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు త్వరలో రానున్నట్లు సమాచారం. ఈ నెల చివరి వారంలో సీఎం పర్యటన ఉండే అవకాశాలున్నాయి. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభించనున్నారు. ఈ నెల 18న రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి జన్మదినం కావడంతో అదే రోజు జిల్లాకు వస్తారని ఇంటెలిజెన్స్‌ వర్గాలు చెబుతున్నాయి. ఈ సమాచారం నేపథ్యంలోనే జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయించే పనిలో నిమగ్నమయ్యారు. కలెక్టర్‌ ఎస్‌. వెంకట్రావు ఇప్పటికే సమీకృత కలెక్టరేట్‌ భవనాన్ని పరిశీలించారు. కేసీఆర్‌ 2017లో పార్లమెంట్‌ ఎన్నికల సమయంలో సూర్యాపేటకు వచ్చారు. దాదాపు ఐదేళ్ల తరువాత జిల్లాకు వస్తున్నారు.

ప్రారంభించనున్న భవనాలు ఇవే..
అధికార యంత్రాంగం సూత్రప్రాయంగా చెబుతున్న ప్రకారం.. జిల్లాలో నూతన కలెక్టరేట్‌, పోలీస్‌ కార్యాలయం, ప్రభుత్వ మెడికల్‌ కళాశాల, సమీకృత మోడల్‌ వెజ్‌, నాన్‌ వెజ్‌ మార్కెట్‌, మున్సిపల్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌, డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల సముదాయం, ఇందిరమ్మ ఫేస్‌ -2 కాలనీ, మురుగు నీటి శుద్ధి కేంద్రం, మినీ ట్యాంక్‌ బండ్‌, పైలాన్‌, ఐలాపురంలో నిర్మించిన గిరిజన ఆశ్రమ పాఠశాలను సీఎం ప్రారంభించనున్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె

- నేటి నుంచి పల్లెల్లో నిలిచిపోనున్న సేవలు
- సర్వీసులు క్రమబద్ధీకరించాలని డిమాండ్‌
- జిల్లా వ్యాప్తంగా 3వేల మంది సిబ్బంది

మఠంపల్లి: తమ డిమాండ్ల సాధనకు గ్రామ పంచాయతీ కార్మికులు(మల్టీపర్పస్‌ వర్కర్లు) గురువారం నుంచి సమ్మె బాట పట్టనున్నారు. చాలీచాలని వేతనాలతో ఏళ్లతరబడి పని చేస్తున్నా సర్వీసు క్రమబద్ధీకరణకు నోచుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల పరిధిలో బిల్‌ కలెక్టర్‌లు, కారోబార్‌లు, పంప్‌మన్లు, స్వీపర్లు, పారిశుద్ధ్య సిబ్బంది సుమారు 3 వేల మంది వరకు పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.9,500 వేతనం గ్రామపంచాయతీకి వచ్చే గ్రాంట్‌ల నుంచి ఇవ్వాలని ఆదేశాలున్నాయి. కానీ నిధులకొరత పేరుతో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు సిబ్బందికి వేతనాలు చెల్లించలేని దుస్థితి చాలా పంచాయతీల్లో ఉందని వాపోతున్నారు. దీనికారణంగా కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం గత పీఆర్సీ ప్రకారం కనీసవేతనం రూ.19వేలు చెల్లించాలని, మల్టీపర్పస్‌ విధానం ఎత్తివేయాలని డిమాండ్‌ చేస్తున్నారు. దీంతో పాటు పీఎఫ్‌, ఈఎస్‌ఐ, ప్రమాదబీమా, గ్రాట్యుటీ వంటివి వర్తింపజేయాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు. నెల రోజుల క్రితం 14 డిమాండ్లతో కూడిన వినతిపత్రం కూడా అందజేశారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీంతో సమ్మెలోకి వెళ్లాలని పంచాయతీ కార్మికులు నిర్ణయం తీసుకున్నారు.



డ్రెయినేజీ శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

డిమాండ్లు ఇవీ..
- మల్టీపర్పస్‌ వర్కర్లను రెగ్యులరైజ్‌ చేయాలి
- ప్రత్యేక బడ్జెట్‌ కేటాయించి వేతనాలు చెల్లించాలి
- జీఓ నంబర్‌ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్‌, బిల్‌కలెక్టర్లకు రూ.19,500 ఇవ్వాలి
- కారోబార్‌, బిల్‌ కలెక్టర్‌ను సహాయ కార్యదర్శులుగా నియమించాలి
- జీఓ 51ని సవరించాలి
- మల్టీపర్పస్‌ వర్కర్‌ విధానాన్ని రద్దు చేయాలి
- విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- ఆదాయం వనరులున్న గ్రామ పంచాయతీల్లో వేతనాలు పెంచడానికి అనుమతి ఇవ్వాలి.
- 8 గంటల పనిదినాలు అమలు చేయాలి. పండుగ సెలవులు, వారాంతపు సెలవు, జాతీయ ఆర్జిత సెలవులు అమలు చేయాలి.
- సిబ్బందిపై వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలి.
- కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలి.

> **పంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి**
> ప్రభుత్వం పంచాయతీల్లో పనిచేస్తున్న జేపీఎస్‌ల సర్వీసులను రెగ్యులరైజ్‌ చేయాలని ప్రకటించింది. అదేవిధంగా పంచాయతీ పరిధిలో అన్నిరకాల విధులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్‌ వర్కర్‌లను కూడా రెగ్యులరైజ్‌ చేయాలి.
> –లక్ష్మణ్‌నాయక్‌, జేపీఎస్‌, పెదవీడు పంచాయతీ.



> **ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం**
> గ్రామపంచాయతీల్లో దశాబ్దాలుగా వివిధ రకాల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రస్తుతం ప్రభుత్వం నెలకు రూ.9,500 వేతనం నేరుగా వారి ఖాతాలోనే వేస్తోంది. అయినప్పటికీ సిబ్బంది కోరికమేరకు సర్వీసు క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా సమర్పించాం.
> –మామిడి జానకిరాములు, ఎంపీడీఓ, మఠంపల్లి



మట్టపల్లి క్షేత్రంలో విశేష పూజలు

మఠంపల్లి: మట్టపల్లి ఆలయంలో అర్చకులు బుధవారం విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని వేదమంత్రాలతో నిర్వహించారు. శ్రీస్వామివారికి కృష్ణానది నుంచి బిందెతీర్థం తెచ్చి పంచామృతాలు, పంచసూక్తాలతో గర్భాలయంలోగల మూలవిరాట్‌కు అభిషేకించారు. శ్రీస్వామి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు చేపట్టారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టువస్త్రాలతో స్వామి అమ్మవారిని వధూవరులుగా అలంకరించినారు. నిత్యకల్యాణోత్సవాన్ని ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదంతో ప్రారంభించి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్య ధారణ, తలంబ్రాలతో ముగించారు.



మట్టపల్లి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రతి నియోజకవర్గానికి 3వేల గృహలక్ష్మి ఇళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్లు, అధికారులు

- కలెక్టర్‌ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గృహలక్ష్మి పథకం కింద జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ వర్గానికి 3 వేల ఇళ్ల చొప్పున మంజూరు చేయడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని కలెక్టర్‌ ఎస్‌. వెంకట్రావు వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తులకు సంబంధించిన విధివిధానాలపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడారు. దారిద్య్రరేఖకు దిగువన ఉండి సొంతజాగా కలిగినవారు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3లక్షలను విడతల వారీగా ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకంపై తహసీల్దార్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు, జీఓ 58,59 ద్వారా నిర్మాణాల క్రమబద్ధీకరణ, సీఎంఆర్‌ సేకరణపై సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పాటిల్‌ హేమంత్‌ కేశవ్‌, యస్‌.మోహన్‌ రావు, ఆర్డీఓలు కిషోర్‌ కుమార్‌, రాజేంద్ర కుమార్‌, సీపీఓ వెంకటేశ్వర్లు, సివిల్‌ సప్లయ్‌ డీఎం రాంపతి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి
ఎన్నికల నిబంధనలపై రెవెన్యూ, పోలీస్‌ అధికారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ యస్‌. వెంకట్రావ్‌ సూచించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల సమాయత్తంపై ఎస్పీ రాజేంద్రప్రసాద్‌, అదనపు కలెక్టర్లు పాటిల్‌ హేమంత కేశవ్‌, యస్‌. మోహన్‌రావులతో కలసి బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల గుర్తింపునకు రెవెన్యూ, పోలీస్‌ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో పోలింగ్‌ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా పోలింగ్‌ కేంద్రాల పేర్ల మార్పు, కొత్త కేంద్రాల ప్రతి పాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో సూర్యాపేట, కోదాడ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్‌, కిషోర్‌ కుమార్‌, డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర రెడ్డి, రవి, ల్యాండ్‌ రికార్డ్స్‌ ఏడీ నాగేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా షీ టీమ్‌ ప్రతినిధి పాండునాయక్‌ కోరారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో షీ టీమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, రక్షణ, 100 డయల్‌, సోషల్‌ మీడియా, టోల్‌ ఫ్రీ 1930 ఇలా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ధనవిజయలక్ష్మి, ఏఎస్‌ఐ జగన్నాథం, షీ టీమ్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ యల్లారెడ్డి, పోలీసు సిబ్బంది వీరబాబు, భాస్కర్‌, వెంకటేశ్వర్లు, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షీ టీమ్‌ ప్రతినిధి పాండునాయక్‌

బడులకు నిధులొచ్చాయ్‌

- ప్రస్తుతం 50శాతం మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- పాఠశాలలు, క్రీడల నిర్వహణకు కలిపి రూ.1.31కోట్లు
- ప్రధానోపాధ్యాయులకు తప్పనున్న ఆర్థిక భారం



హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

హుజూర్‌నగర్‌: ఈ విద్యాసంవత్సరంలో సర్కారు స్కూళ్ల నిర్వహణకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి నిర్వహణకు ఒక్క పైసా కూడా లేక జిల్లాలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో వారికి ఊరట కలిగింది. బడులతో పాటు క్రీడల నిర్వహణకు నిధులు మంజూరు చేయడంతో మరింత ఉపశమనం కలిగింది. ఈ విద్యా సంవత్సరానికి రావాల్సిన మొత్తం నిధుల్లో ప్రస్తుతం 50 శాతం మంజూరు చేశారు.

విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాల నిర్వహణ నిధులు
జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు అన్నీ కలిపి 1,006 ఉన్నాయి. వాటిలో 871 పాఠశాలలకు 1.31 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. వీటిలో పాఠశాలల నిర్వహణకు రూ. 1.03 కోట్లు, క్రీడల నిర్వహణకు రూ. 28 లక్షలు ఉన్నాయి. క్రీడల నిర్వహణ నిధుల్లో ..ప్రాథమిక పాఠశాలకు రూ. 5వేలు, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున మంజూరయ్యాయి. పాఠశాలల నిర్వహణ కోసం మంజూరైన నిధులను ఆయా స్కూళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి విద్యాశాఖ అధికారులు కేటాయించనున్నారు. 1 నుంచి 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు రూ 10 వేలు, 31 నుంచి 100 మంది విద్యార్థులు ఉంటే రూ 25 వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ. 50 వేలు, 251 నుంచి వెయ్యి లోపు విద్యార్థులున్న పాఠశాలలకు రూ. 75 వేల చొప్పున ఇవ్వనున్నారు.

> **హెచ్‌ఎంలకు ఊరట**
> ప్రభుత్వ ఆదేశాల మేరకు బడిబాట, పాఠశాలల్లో ఇతర కార్యక్రమాల నిర్వహణ, స్టేషనరీ కొనుగోలుకు నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ నిధులు అందుబాటులో లేక జిల్లాలోని పలు పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కలిసి సొంతంగా డబ్బులు ఖర్చుపెట్టుకున్నారు. అవి ఎప్పుడు వస్తాయో తెలియక సతమతమవుతూ వాటి కోసం ఎదురు చూస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై పాఠశాలలు తెరిచే సమయంలో ఆయా పాఠశాలల్లో చిన్నచిన్న మరమ్మతులు చేయించలేని పరిస్థితి నెలకొంది. హెచ్‌ఎంలపై ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో మెజారిటీ పాఠశాలల్లో పలు కార్యక్రమాలు మొక్కుబడిగా సాగాయనే విమర్శలు కూడా ఉన్నాయి. మరోవైపు ఇన్‌చార్జి హెచ్‌ఎంలు ఉన్న చోట బడుల నిర్వహణకు డబ్బులు లేక వారు ఆ బాధ్యతల నుంచి తప్పుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

> **మొదట విద్యుత్‌ బిల్లులు చెల్లించాలి**
> పాఠశాలల నిర్వహణన కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వాటిలో ముందుగా హెచ్‌ఎంలు విద్యుత్‌ బిల్లులు చెల్లించాలి. ఆ తర్వాత ప్రాధాన్యతను బట్టి మిగతా వాటిని వినియోగించుకోవాలి. అయితే ప్రభుత్వం నుండి వచ్చిన నిధులను విద్యార్థుల సంఖ్య ఆధారంగా వాటిని కేటాయిస్తారు. వచ్చిన నిధులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులకు, పాఠశాలకు అవసరమైన వాటికే వినియోగించుకోవాలి.
> – కె అశోక్‌, డీఈఓ, సూర్యాపేట



సహకార సంఘాల్లో ‘మీసేవ’లు

- కామన్‌ సర్వీస్‌ సెంటర్‌లుగా పీఏసీఎస్‌లు
- ఆర్థిక పరిపుష్టి కోసం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలోని 108 సంఘాల్లో ఏర్పాటుకు కసరత్తు

నల్లగొండ అగ్రికల్చర్‌ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్‌) బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అన్ని సహకార సంఘాలను కామన్‌ సర్వీస్‌ సెంటర్లుగా ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిచ్చింది. ఇప్పటికే రైతులకు రుణాలు ఇవ్వడం, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను విక్రయించడంతో పాటు కొన్ని సంఘాలు పెట్రోల్‌, డీజిల్‌ బంక్‌లు నిర్వహిస్తున్నాయి. ధాన్యం నిల్వ చేసుకోవడానికి గోదాములను నిర్మించి అద్దెకు ఇస్తున్నాయి. ఇలా రకరకాల వ్యాపారాలు నిర్వహిస్తూ సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతమవుతున్న విషయం తెలిసిందే. వాటిని మరింత పరిపుష్టం చేయడానికి కేంద్రం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి జిల్లాలో 108 సంఘాలు..
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 108 సహకార సంఘాలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 42, సూర్యాపేట జిల్లాలో 40, యాదాద్రి భువనగిరి జిల్లాలో 26 ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం పీఏసీఎస్‌లను కామన్‌ సర్వీస్‌ సెంటర్‌లు మార్చుకునేందుకు అనుమతిని ఇచ్చిన నేపథ్యంలో ఇటీవల జరిగిన డీసీసీబీ మహాజన సభలో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించి హర్షం వ్యక్తం చేస్తూ కేంద్రానికి ధన్యవాదాలు తెలియజేశారు.

గ్రామీణులకు ఎంతో మేలు..
సహకార సంఘాలను కామన్‌ సర్వీస్‌ సెంటర్లుగా మార్చితే ప్రస్తుతం మీ సేవ కేంద్రాల్లో అందించే సేవలన్నీ ప్రజలు పొందేవీలుంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఆశించిన స్థాయిలో మీసేవ కేంద్రాలు లేవు. దీంతో విద్యార్థులు, ప్రజలు, నిరుద్యోగులు, పెన్షనర్లు, ఉద్యోగులు వివిధ ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవడానికి పట్టణాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. ఇక సహకార సంఘాల్లో కామన్‌ సర్వీస్‌ సెంటర్ల ఏర్పాటు వల్ల గ్రామీణులకు మేలు కలుగుతుంది.

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

చిట్యాల: పట్టణ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో నలుగురు వ్యక్తులు పేకాడుతుండగా మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.25వేల నగదు, స్కూటీ, కారు, సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

డిండి: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని వేగంగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో ఆమె మృతిచెందింది. ఈ ఘటన బుధవారం డిండి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల కేంద్రానికి చెందిన సూదిని రామచంద్రమ్మ(83) స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న బేకరీ వద్దకు వెళ్లేందుకు హైదరాబాద్–శ్రీశైలం హైవే దాటుతోంది. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా తిప్పారెడ్డిపల్లి నుంచి డిండి పట్టణాకి వేగంగా వస్తున్న బైక్ రామచంద్రమ్మను ఢీకొట్టడంతో ఆమె రోడ్డుపై పడిపోయింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను కల్వకుర్తికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి


మల్లయ్యగౌడ్ (ఫైల్)

మోతె: ఇటీవల హైదరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన వ్యక్తి బుధవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవాపురం గ్రామానికి చెందిన పాలకూరి మల్లయ్యగౌడ్ (58) 15 సంవత్సరాల క్రితం బతుకుదెరువు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో చైతన్యపురి–ఎల్‌బీ నగర్ ఏరియాలో ఆటో యూనియన్‌లో సభ్యుడిగా చేరాడు. ప్రతి సంవత్సరం ఆటో యూనియన్ ఎన్నికలు జరుగుతుండగా ప్రతిసారి ముస్లింలే యూనియన్ అధ్యక్షులుగా ఎన్నికయ్యేవారు. కాగా ఈ ఏడాది జరిగే యూనియన్ ఎన్నికల్లో తాను అధ్యక్షుడిగా పోటీలో ఉంటానని మల్లయ్య గౌడ్ తోటి డ్రైవర్లతో అన్నాడు. అలా చెప్పిన మరుసటి రోజు నుంచే మల్లయ్యగౌడ్‌కు బెదిరింపు కాల్స్ రాగా, అదే రోజు తన బంధువుల ఇంటికి వెళ్లి తిగిరి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు మల్లయ్య గొంతు కోసి పరారయ్యారు. కుటుంబ సభ్యులు మల్లయ్యను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్న మోదీ

నల్లగొండ టౌన్ : కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరిస్తూ.. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్, రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు విమర్శించారు. బుధవారం ఆ పార్టీ నల్లగొండ జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల రెండో రోజు వారు మాట్లాడారు. స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని బయటకు తెచ్చి జనధన్ ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున వేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. నలధనం రాకపోగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టి అనేక మంది పెద్దలు దేశం విడిచి పారిపోయారని దుయ్యబట్టారు. పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు తుమ్మల వీరారెడ్డి, డబ్బికార్ మల్లేష్, పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, సయ్యద్‌హాషం, చినపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రబావతి, ఎండీ.సలీం తదితరులు పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య దారుణ హత్య

- కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఘటన
- కుటుంబ కలహాలతోనే ఘాతుకానికి ఒడిగట్టిన నిందితుడు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు


సమీనా (ఫైల్)

కొండమల్లేపల్లి: కుటుంబ కలహాల కారణంగా భర్త చేతిలో భార్య దారుణ హత్యకు గురైన ఘటన బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన మహమూద్ అలీ, అమీనా దంపతుల పెద్ద కుమార్తె సమీనాను పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ రెహమాన్ అలీకి ఇచ్చి వివాహం జరిపించారు. వివాహం అనంతరం రెహమాన్ అలీ భార్య సమీనాతో కలిసి కొండమల్లేపల్లిలోని 8వ వార్డులో నివాసముంటూ జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదిలా ఉంటే కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో రెహమాన్ అలీ మద్యానికి బానిస అయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం సమీనా తన ఇద్దరు పిల్లలను పాఠశాలకు పంపించి చిన్నకుమారుడితో ఇంటి వద్దే ఉంది. అదే సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చిన రెహమాన్ భార్య సమీనాతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలోనే రెహమాన్ అలీ ఇంట్లో ఉన్న రోకలిబండతో సమీనా తలపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. రెహమాన్ అలీ అక్కడి నుంచి పరారయ్యాడు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లలు తల్లి విగతజీవిగా ఉండడాన్ని చూసి భయంతో పక్కనే ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వెళ్లి సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి, దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఎస్‌ఐ వీరబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే తల్లి మరణించిందనే విషయం తెలియక ముగ్గురు చిన్నారులు అమాయకంగా చూస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు తదితరులు


అమాయకంగా చూస్తున్న మృతురాలి పిల్లలు

ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


మణిశంకర్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని ఇంద్రియాల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రియాల గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి నర్సింహ, వాణి దంపతులకు కుమారుడు మణిశంకర్(17), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా మణిశంకర్ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్‌లోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇంటర్ ఫస్టియర్‌లో అన్ని సబ్జెక్ట్‌లలో ఫెయిల్ అయ్యాడు. దీంతో ఇటీవల సప్లిమెంటరీ పరీక్షలు కూడా రాసి, కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ప్రతిరోజు రాత్రి ఇంటి పక్కనే ఉంటున్న తన నాయనమ్మ చంద్రమ్మ గదిలో నిద్రిస్తున్నాడు. కాగా చంద్రమ్మ మూడు రోజుల క్రితం ఊరికి వెళ్లింది. రోజుమాదిరిగానే మంగళవారం రాత్రి కూడా మణిశంకర్ నిద్రించేందుకు నాయనమ్మ గదికి వెళ్లాడు. బుధవారం ఉదయం 9గంటలైనా మణిశంకర్ ఇంట్లోకి రాకపోయేసరికి అతడి తల్లి వాణి గది వద్దకు వెళ్లి చూడగా లోపల నుంచి గడియపెట్టి ఉంది. ఎంత పిలిచినా పలకకపోయేసరికి ఆందోళనతో కిటికిలోంచి చూడగా మణిశంకర్ చీరతో ఉరేసుకొని కనిపించాడు. వెంటనే ఇరుగు పొరుగు వారిని పిలిచి, వారి సహాయంతో గది తలుపు తెరిచి లోనికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 10వ తేదీన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల కానున్నాయని తెలిసినప్పటి నుంచి మణిశంకర్ ముభావంగా ఉంటున్నాడని, సప్లిమెంటరీ పరీక్షల్లో మళ్లీ ఫెయిల్ అవుతాననే భయంతోనే ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చునని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.

భూతగాదాలో వృద్ధురాలిపై కర్రలతో దాడి

- పోలీసులకు సమాచారమిచ్చినా పట్టించుకోలేదని బాధితురాలి కుటుంబ సభ్యుల ఆరోపణ


గాయపడిన అసన్‌బీ

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట): భూతగాదాలో వృద్ధురాలిపై ఆరుగురు వ్యక్తులు కర్రలతో దాడి చేసిన ఘటన ఆత్మకూర్–ఎస్ మండల పరిధిలోని కందగట్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కందగట్ల గ్రామానికి చెందిన షేక్ యాకూబ్ అలీ, అసన్‌బీ భార్యాభర్తలు. వీరికి కుమార్తె షమీనా సంతానం కాగా ఆమెకు వివాహం చేశారు. వృద్ధాప్యం కారణంగా యాకూబ్ అలీ అనారోగ్యంతో ఉండడంతో అసన్‌బీ మంగళవారం గ్రామంలోని తమ వ్యవసాయ భూమిని ట్రాక్టర్‌తో దున్నిస్తోంది. వీరికి తమ పక్కనే భూమి ఉన్న షేక్ మల్సూర్, షేక్ లతీఫ్ కుటుంబంతో కొంతకాలంగా గెట్టు పంచాయితీ నడుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం భూమి దున్నిస్తోన్న అసన్‌బీ వద్దకు షేక్ మల్సూర్, షేక్ లతీఫ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు మరో నలుగురు వచ్చి కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. భూమి దున్నుతున్న ట్రాక్టర్ డ్రైవర్ వచ్చి ఆపడంతో దాడి చేసిన వారు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో అసన్‌బీ తల, చేతికి, కడుపుపై తీవ్రగాయాలై స్పృహ కోల్పోయింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా అసన్‌బీపై దాడి జరిగిన విషయం తెలుసుకొని వెంటనే డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు స్పందించలేదని, అంతేకాకుండా మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదని బాధితురాలి కుమార్తె షమీనా, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. తాను రెండు రోజులు సెలవులో ఉన్నానని, బుధవారం జిల్లా మీటింగ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. తాను స్టేషన్‌కు వెళ్లాక పూర్తి వివరాలు తెలుసుకొని విచారణ చేస్తామని పేర్కొన్నారు.

భూ వివాదంలో వ్యక్తిపై దాడి

- ఇద్దరిపై కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): భూ వివాదంలో వ్యక్తిపై కొడవలితో దాడి చేసిన ఇద్దరిపై బుధవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలంలోని జొన్నలగడ్డగూడేనికి చెందిన చల్లమల్ల జయమ్మ, ప్రతాప్‌రెడ్డి దంపతులకు అదే గ్రామానికి చెందిన చల్లమల్ల వేమారెడ్డి, వెంకట్‌రెడ్డి మధ్య కొంతకాలంగా భూ తగాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై మంగళవారం గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుతుండగా.. వేమారెడ్డి, వెంకట్‌రెడ్డి కలిసి జయమ్మ, ప్రతాప్‌రెడ్డి దంపతులను బెదిరించారు. అనంతరం ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు. అయితే సాయంత్రం ఇంటి వద్ద గేదెలను కట్టేస్తున్న ప్రతాప్‌రెడ్డిపై వేమారెడ్డి, వెంకట్‌రెడ్డి కొడవలితో దాడి చేశారు. ఈ దాడిలో ప్రతాప్‌రెడ్డి చెంపపై గాయమైంది. కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు 13 కుట్లు వేశారు. బుధవారం జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేమారెడ్డి, వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్. ధర్మా తెలిపారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

కట్టంగూర్: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఉల్లిపాయల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నుంచి విజయవాడకు ఉల్లిపాయల లోడ్‌తో వెళ్తున్న లారీ కట్టంగూర్ గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి హైవే పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌తో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి.

బైక్‌పై వెళ్తుండగా ఆటో ఢీకొట్టడంతో..

సంస్థాన్ నారాయణపురం: బైక్‌పై వెళ్తున్న దంపతులను వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో గాయాలపాలయ్యారు. ఈ ఘటన బుధవారం సంస్థాన్ నారాయణపురం మండలంలోని గుడిమల్కాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన బొడిగె యాదయ్య, అనసూయ దంపతులు స్కూటీపై చౌటుప్పల్ వెళ్తుండగా గుడిమల్కాపురం గ్రామ సమీపంలో వెనుక నుంచి ఆటో వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదయ్య, అనసూయకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వారిని హైదరాబాద్‌కు తరలించారు.

బైక్ ఢీకొని మహిళకు..

బీబీనగర్: మండల కేంద్రంలోని చెరువు కట్ట సమీంపలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్‌కు చెందిన చింతపట్ల నిర్మల స్థానిక చెరువు కట్ట వద్ద హైవే దాటుతుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న యువకులు ఆమెను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన నిర్మలను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై ప్రయాణిస్తున్న యువకులను స్వల్ప గాయాలు కాగా వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టి..

భువనగిరి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఆగి ఉన్న లారీని ఢీకొట్టి గాయాలపాలైన ఘటన భువనగిరి మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ మండలం రాయపల్లి గ్రామానికి చెందిన నాతి నరేష్ సోమవారం సాయంత్రం స్వగ్రామం నుంచి పని నిమిత్తం బైక్‌పై భువనగిరి వెళ్తున్నాడు. ఈ క్రమంలో భువనగిరి మండలంలోని కూనూరు గ్రామ సమీపంలో కోళ్ల ఫాం వద్దకు రాగానే రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా రోడ్డుపై లారీ నిలిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి బంధువు బుధవారం పోలీసులుకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

భువనగిరి: పట్టణంలోని ఎస్‌వీ వైన్స్‌లో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షట్టర్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి రూ.15వేల నగదు, రూ.3వేల విలువ చేసే మద్యం బాటిల్‌తో పాటు సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లారు. అదేవిధంగా బస్టాండ్ సమీపంలోని శివ ఉడిపి హోటల్‌లో కూడా సుమారు రూ.15వేల నగదుతో పాటు హార్డ్‌డిస్క్‌ను ఎత్తుకెళ్లారు. బుధవారం ఆయా షాపుల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పోలీసులు తెలిపారు.

ఇటీవల వరుసగా దొంగతనాలు..

ఇటీవల భువనగిరి పట్టణంలో ప్రధాన రహదారి వెంట ఉన్న దుకాణాలే లక్ష్యంగా దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. గత నెల 22వ తేదీ రాత్రి కూడా పట్టణంలోని ప్రిన్స్ మెడికల్ హాల్‌తో పాటు ప్రిన్స్ మెడికల్ ఏజెన్సీలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. అదే రోజు రాత్రి గ్రీన్ బకెట్ బిర్యానీ సెంటర్‌లో సైతం చోరీ చేసి మొత్తం రూ.3 లక్షల నగదుతో పాటు సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లను ఎత్తుకెళ్లారు. దొంగలు తమ ఆధారాలు దొరకకుండా ముందుగా ఆయా దుకాణాల్లోని సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లను ఎత్తుకెళ్తుండడం గమనార్హం.

కూరెళ్లకు ఫేమస్ పర్సనాలిటీ పురస్కారం


కూరెళ్ల విఠలాచార్యకు పురస్కారం అందజేస్తున్న ఎంఈఓ శ్రీధర్

రామన్నపేట: కవి, దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు జిల్లా విద్యాశాఖ ఫేమస్ పర్సనాలిటీ పురస్కారం ప్రదానం చేసింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కూరెళ్లను పురస్కారానికి ఎంపిక చేయగా వ్యక్తిగత కారణాల వల్ల అందుకోలేకపోయారు. డీఈఓ ఆదేశాల మేరకు బుధవారం మండల విద్యాధికారి శ్రీధర్ వెల్లంకిలో కూరెళ్లను సత్కరించి పురస్కారంతో పాటు మెమెంటో అందజేశారు.


విద్యుత్ మోటార్లు చోరీ.. బెంబేలెత్తుతున్న రైతులు

మఠంపల్లి: మండలంలోని కాల్వపల్లితండా, అల్లీపురం, కొత్తదొనబండతండాల పరిధిలో రైతుల వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. బుధవారం కాల్వపల్లితండా సర్పంచ్ మాలోతు సుజాతాసక్రునాయక్‌తో పాటు విద్యుత్ మోటార్లు చోరీకి గురైన రైతులు మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆయా గ్రామాలకు చెందిన రైతులు బానోతు శ్రీను, బానోతు పాండు, భూక్యా కోటు, బోగాల సంజీవరెడ్డి, బేత శ్రీనివాస రెడ్డి వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్లతో పాటు వైర్ సెట్టింగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని అన్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు.


కాల్వపల్లితండాలో విద్యుత్ మోటార్‌ను పగులగొట్టి వైరింగ్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు

యాదాద్రి ఆలయంలో నిత్యారాధనలు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూవులకు బిందె తీర్థం, ఆరాధన, బాలభోగం, మూలవర్యులకు నిజాభిషేకం చేశారు. అదే విధంగా స్వామివారికి సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలు నిర్వహించారు. రాత్రి శయనోత్సవం జరిపించి ద్వారబంధనం చేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్య కల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా స్వామి వారి నిత్య ఆదాయం రూ. 14,15,972 వచ్చిందని ఆలయ అధికారులు వెల్లడించారు.


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం

- యువకుడిపై కేసు నమోదు

శాలిగౌరారం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన శాలిగౌరారం మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాలిల ప్రకారం.. ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన అనూప్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించి శారీరకంగా లోబర్చుకున్నాడు. ఇటీవల ఆ యువతి తనను పెళ్లి చేసుకోవాలని అనూప్‌ను కోరగా అతడు ముఖం చాటేస్తూ పెళ్లికి నిరాకరించాడు. దీంతో సదరు యువతి బుధవారం శాలిగౌరారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అనూప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వివరించారు.

ప్రజలంతా సీఎం కేసీఆర్ వెంటే

గుండాల : ప్రతిపక్షాలు ఎన్ని అబద్ధాలు చెప్పినా, దుష్ప్రచారం చేసిన రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ వెంటే ఉన్నారని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తెలిపారు. గుండాల మండలం వంగాల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. స్వరాష్ట్రంతో తెలంగాణ అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని, దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిని చూసి జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు.. బీఆర్‌ఎస్ సర్కార్‌పై ఆరోపణలు చేస్తున్నాయన్నారు. అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్ రూ.4వేలు ఇస్తామని ఖమ్మం సభలో కాంగ్రెస్ నాయకులు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు, ఆసరా పింఛన్ వంటి పథకాలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.80వేల కోట్లు ఖర్చయ్యిందని, అలాంటప్పుడు రూ.లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగిందో ప్రతిపక్షాలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రేవంత్‌రెడ్డిది రెండు నాల్కల ధోరణి అని, గతంలో సోనియాగాంధీని దయ్యం అని దూషించిన సందర్భాలు ఉన్నాయన్నారు. జైలుకు వెళ్లొచ్చిన వ్యక్తిని ఆ పార్టీ అధిష్టానం పీసీసీ చీఫ్‌గా నియమించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి ఎక్కడ అడుగుపెడితే అక్కడ ఆ పార్టీ పాతాళానికి పోతుందన్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ నలుగురు ఎమ్మెల్యేలను కొనాలని ప్రయత్నించి కూడా తడి బట్టలతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రమాణం చేశారని, అందుకే ఆయన పదవి పోయిందన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ ప్రకారం యాదాద్రి జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసి మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ఏడారిగా ఉన్న గుండాల మండలానికి సాగునీరు అందించి సస్యశ్యామలం చేశామని పేర్కొన్నారు. అదే విధంగా అంబాల గ్రామంలో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. పాచిల్ల, బూర్జుబావి గ్రామాల్లో పంచాయతీల భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, ఎంపీపీ తాండ్ర అమరావతి, జెడ్పీటీసీ కోలుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల అబ్బులు, తోటకూరి రాధిక, మునలి విజితారెడ్డి, జక్కుల భిక్షమయ్య, ప్రజాప్రతినిధులు సైదులు, యాస భాషిరెడ్డి, పొన్నగాని మహేష్, పందుల రేఖ, బి.యాదలక్ష్మి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వంగాలలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ సునీత

పెసర సాగుకు అనువైన సమయమిదే

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు



నడిగూడెం: వానాకాలంలో సాగు చేసే అపరాలలో పెసర ముఖ్యమైన పంట. ఈ సీజన్‌లో పెసర సాగు చేసుకుంటే అధిక ఆదాయం పొందవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు చెబుతున్నారు. పెసర పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

- **నేలలు:** తేమను పట్టి ఉంచే అన్నిరకాల భూములలో పెసర పంట సాగు చేసుకోవచ్చు. చౌడు నేలలు, మురుగు నీరు నిలిచే నేలలు ఈ పంట సాగుకు పనికిరావు.
- **విత్తన మోతాదు:** ఒక ఎకరానికి 6 నుంచి 8కిలోలు సరిపోతుంది. మూడు కాలాలలో విత్తుకోవచ్చు.
- **విత్తనశుద్ధి:** కిలో విత్తనానికి 5గ్రాములు ఇమిడాక్లోప్రిడ్ లేదా 5గ్రాములు థయోమిథాక్సామ్ లేదా 5మి.లీ. మోనోక్రోటోఫాస్‌ను కలిపి విత్తన శుద్ధి చేసినట్లయితే సుమారు 15 నుంచి 20 రోజుల వరకు రసం పీల్చే పురుగులను నివారించుకోవచ్చు. మొదటిసారి పంటను సాగు చేసేటప్పుడు రైజోబియం కల్చర్‌ను విత్తనానికి పట్టించాలి. 200 గ్రాములు రైజోబియం కల్చర్ ఎకరానికి సరిపడా విత్తనానికి బాగా కలిపి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి. మొదట శిలీంద్రనాశిని మందుతో శుద్ధి చేసి, ఆరబెట్టిన తర్వాత రైజోబియంను పట్టించాలి.
- **విత్తే దూరం:** వానాకాలం మరియు యాసంగిలో సాళ్ల పద్ధతిలో ఆరుతడి పంటగా విత్తినప్పుడు సాలుకు సాలుకు మధ్య 30సెం.మీ, మొక్కకు మొక్కకు మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. వేసవిలో ఆరుతడి పంటగా విత్తుకొనేటప్పుడు సాలుకు సాలుకు మధ్య 22.5 సెం.మీ. దూరం ఉండేటట్లు విత్తుకోవాలి.
- **విత్తే పద్ధతి:** నాగలితో లేదా కల్టివేటర్‌తో ఒక సారి, ఆ తర్వాత గొర్రుతో రెండు సార్లు భూమిని మెత్తగా దున్ని చదును చేసి, విత్తుటకు సిద్ధ చేసుకోవాలి. సాళ్ల పద్ధతిలో నాగలి లేదా గొర్రుతో విత్తుకోవాలి. యాంత్రికంగా ట్రాక్టర్ కల్టివేటర్ లేదా సీడ్ డ్రిల్ కమ్ ఫర్టిలైజర్‌తో బోదె కాలువల పద్ధతిలో కూడా విత్తుకోవచ్చు.


సాగులో ఉన్న పెసర పంట

- **రకాలు:** ఎమ్.జి.జి.–295, డబ్ల్యూ జి.జి.–37, టి. ఎమ్.–96–2, ఎం.జి.జి. 347 (మధిర పెసర), ఎం.జి.జి.348 (భద్రాద్రి), ఎం.జి.జి. –351(శ్రీరామ), డబ్ల్యూ.జి.జి.–42 (యాదాద్రి) తదితర రకాలు సాగు చేసుకొనేందుకు అనుకూలం. పంట కాలం 60 నుంచి 65 రోజుల లో పూర్తవుతుంది.

పాడి పంట

- **అంతర పంటలు:** కంది, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలతో పెసరను అంతర పంటగా సాగు చేసుకోవచ్చు.
- **రసాయ ఎరువులు:** ఎకరానికి 8కిలోలు నత్రజని, 20కిలోలు భాస్వరం ఇచ్చే ఎరువులు, ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. అనగా 18కిలోల యూరియా, 125కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ లేదా 50కిలోల డీఏపీని వాడాలి. వరి తర్వాత మాగాణుల్లో విత్తుకున్నప్పుడు ఎరువులు వేయడం వీలుపడదు. అవసరం మేరకే పోషకాలను పైపాటుగా పిచికారీ ద్వారా అందించాలి. భూసార పరీక్ష ఆధారంగా సిఫార్సు మేరకు రసాయన ఎరువులను వాడాలి.
- **పంట దిగుబడి:** ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 5 నుండి 6 క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుంది.

- **ఎరువుల యాజమాన్యం:** సేంద్రియ ఎరువులైతే చివరి దుక్కిలో ఎకరానికి రెండు టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ముందు పంట మోళ్లను రోటోవేటర్‌తో భూమిలో కలియదున్నాలి. జీవన ఎరువులైతే రైజోబియం కల్చర్‌ను విత్తనానికి పట్టించి ఉపయోగించాలి. 100లీటర్ల నీటిలో 10గ్రాముల పంచదార లేదా బెల్లం లేదా గంజి పొడరును కలిపి 10 నిమిషాలు మరగబెట్టి చల్లార్చాలి. చల్లారిన ద్రావణం 8కిలోల విత్తనాలపై చల్లి దానికి 200గ్రాముల రైజోబియం కల్చర్ పొడిని బాగా కలియబెట్టి విత్తనం చుట్టూ పొరలా ఏర్పడేటట్లు జాగ్రత్త వహించాలి. ఈ ప్రక్రియకు పాలిథిన్ సంచులను ఉపయోగించి చేసుకోవాలి. రైజోబియం పట్టించిన విత్తనాన్ని నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి. ఎకరానికి 2 కిలోల ఫాస్ఫోబ్యాక్టర్‌ను 200 కిలోల సేంద్రియ ఎరువులో కలిపి దుక్కిలోగానీ, విత్తనం విత్తేటప్పుడు గానీ సాళ్లలో పడేటట్లు వేసుకోవాలి. ఈ ఎరువు మొక్కలు లభ్యంకాని రూపంలో ఉన్న భాస్వరం లభ్యమవుతుంది.